# అపర్ణోపాఖ్యానము

కోడూరు పట్టణములో కోటికి పడగలెత్తిన కోటేశ్వరరావు గారాలపట్టి అపర్ణ హైద్రాబాద్ హాస్టల్లో ఉంటూ మెస్సులో తింటూ వుమెన్స్ కాలేజిలో డిగ్రీ చదువుతోంది.

పచ్చి పల్లెటూరులో పెరిగి కోడూరు కాలేజిలో చదివి డిగ్రీ ఫస్టుక్లాసులో పాసైన మధ్యతరగతి మందహాసము మధుసూదన్ హైద్రాబాద్ మెగాసిటీలో సగటు ఉద్యోగిగా అవతారమెత్తి సంవత్సరం గడిచిపోయింది.

ఓ ఆదివారం సాయంత్రం ... అనుకోకుండా ఆ ఇద్దరి కళ్ళూ నౌబత్ పహాడ్ మీద, వెంకటేశ్వరుని క్యూలో కలుసుకున్నాయి. గర్భగుడిలో మూలవిరాట్ సన్నిధిలో భుజాలు ఒరుసుకోవడం, కాళ్లు కలుసుకోవడం కాకతాళీయమే. కాని... దోరమాగిన మామిడిపండు దేహఛాయ, పొడగాటి చేతులు, ఉంగరాల జుట్టు, కత్తెరమీసం కట్టుతో మగాడి అందాలకు అసలైన ప్రతినిధిలా కనబడిన మధుసూదన్ వెంటబడి అపర్ణ అతని పక్కనే నడవడం... కావాలనే జరిగింది.

సామనఛాయతో సగటు అందగత్తెయైన అపర్ణకు అభిజాత్యం పాలెక్కువ. చక్కని చుక్క పక్కనే నడుస్తూంటే... మధుసూదన్ గుండెల్లో సన్నటి గుబులు...

'సారీ మేడమ్' అనేశాడు ఎందుకైనా మంచిదని

'దేరీజ్ నో లారీ టు క్యారీ యువర్ సారీ మిస్టర్' కాటుక కళ్లను గిర్రున తిప్పుతూ కిసిక్కుమంది. ఓరకంటితో చూస్తూ రిజిస్టర్ లెటర్ వెంట ఎకనాలెడ్జ్‌మెంటులా అతని పక్కనే నడిచింది. అతను కూచున్న చెట్టు కిందనే, అతని పక్కనే కూచుంది. వెలుతురు పువ్వుల్లా కనిపిస్తున్న నియాన్ లైట్ల వెలుతుర్లో భాగ్యనగర్ అందాలను చూస్తూ మాటల్లోకి దింపింది. కలుపుగోలు తనంతో కట్టిపడేసింది.

ఇద్దరూ కోడూరు మనుషులే. దోరవయసు, కోర చూపులు... మనసు నల్లరి పెట్టినై. అదే పరిచయం ప్రతి ఆదివారము అక్కడే కలుసుకుని చేతిలో చెయ్యేసి ప్రేమబాటలో నడిచేలా చేసింది. అపర్ణ పరీక్షలైపోయినై. ప్రేమ సంగతి పెద్దలదాకా వెళ్లింది. అంతస్తుల విషయములో అమ్మానాన్నలు అభ్యంతరం తెలిపినా గారాలపట్టి పట్టుదల పట్టుసడలలేదు. ఆకాశమంత పెళ్లిపందిరి కింద భూదేవంత పీటల మీద రంగరంగ వైభోగంగా పెళ్లై పోయింది.

మూడంతస్తుల బంగళాలో పెరుగుతూ కోటి కోర్కెలు కొంగున ముడేసుకున్న అపర్ణ మూడు గదుల అద్దింటిలో మురిపాల మాటలు విప్పుకుంది. భర్త పట్ల అపారమైన అనురాగముంది గాని వంటపని, ఇంటి పనులూ చేసుకోవాలంటే కష్టమన్పించింది.

మధుసూదన్ మంచిమాట, కలుపుగోలుతనం అంతకుముందే ఆ వీధివారి అభిమానం చూరగొన్నాయి. అదే అభిమానం కొత్తజంట గృహప్రవేశం చేస్తుంటే హారతిచ్చి స్వాగతం పలికింది. అదే బంగళా మీదున్న స్వరూప తియ్యని గొంతు స్వాగతగీతం పాడింది. 'వదినా ! అన్నయ్య పేరు చెప్పమని పరాచకాలాడింది.' జాగ్రత్త ! నేన్నీ ఆడబిడ్డను' అని వార్నింగిచ్చి చెంపమీద చిటికేసింది.

మొదటి రోజు పక్కింట్లో భోజనం... సెకండ్‌షో సినిమా... పసందుగా గడిచింది. మర్నాడు తెల్లవారి పొద్దెక్కిపోయింది. పాలవాడి కేక తలుపులు తట్టింది. అది కలనో, నిజమో తేల్చుకునేందుకు మరికొంత సమయం పట్టింది.

ఆదరాబాదరాగా మంచం దిగి అపర్ణ భుజాలు పట్టి కదిపాడతడు. అపర్ణ జీవితములో అలవాటులేని పనులు ఆరోజే ప్రారంభమైనాయి. ఆవులిస్తూ లేచి పాలు పట్టింది. అవస్తపడుతూ, అభిమానపడుతూ చీపురందుకుంది. ఎలాగోలా ఇల్లూడ్చింది. రాత్రి తిని పారేసిన అరటి తొక్కలతో సహా చెత్తంతా ఎత్తేసింది.

... మున్సిపల్ చెత్తకుండీదాకా వెల్లాలంటే మూడొందల మీటర్లు నడవాలి. చెత్తబుట్ట పట్టుకుని నడిరోడ్డు మీద నడుస్తుంటే... పరువు పరారై పోవచ్చు. అంతే ! పెదాలు బిగుసుకుపోయినై.

గడపదాకా వచ్చి చెత్తను బజారులోకి విసిరేసి విజయగర్వంతో వెనుదిరగ బోయింది. వాకిట్లోంచి 'అయ్యయ్యో ! అమ్మో' గావుకేక వినిపించింది. గుడికెళ్లేందుకు అప్పుడే బంగళా దిగి వస్తున్న స్వరూప మీద పడిందా చెత్త. కుడికాలు అరటి తొక్కమీద పడింది. జర్రున జారి వెల్లకిలా పడిపోయింది. అరుగు కొనకు తలబాదుకున్న కొబ్బరి కాయ ముక్కలైంది. పూల బుట్టి కీళ్లూడిపోయినై. పసుపు, కుంకుమ, పూలు... పూజా సామాగ్రి చెల్లాచెదురైపోయింది.

పక్కింటి కుటుంబాల వాళ్లు పరుగెత్తు కొచ్చారు. లేవనెత్తి అరుగుమీద కూచోబెట్టడం స్వరూప భర్త వంతయింది.

'ఇదేమన్యాయమమ్మా ! ఇంటెడు చెత్తనిలా ఇంటి ముందుకు విసిరేస్తారా ?' నిలదీశారొకరు.

'ఇంత పొద్దున గుడికెల్తూ అంత అజాగ్రత్తనా ?' ధుమధుమ లాడింది అపర్ణ – స్వరూపను చురచుర చూస్తూ.

'అదేమిటమ్మా ... చదువుకున్న దానిలాగున్నావు'

'ఇల్లూడ్చిన చెత్తను మున్సిపాలిటీ కుండీలో పారెయ్యాలి గదా !'

'అందరూ అట్లానే చేస్తే ... సిటీ సెంటరు కుప్పై పోతుంది.'

రకరకాల వ్యాఖ్యానాలు ... ఒంటినిండా తేల్లూ, జెర్రులు పాకినట్టైంది అపర్ణకు. ఆవిడే సరిగ్గా నడిస్తే సరిపోయేది గదా'.

'మిస్టర్ మధూ ! మా చెల్లాయికి మీరన్నా చెప్పండి' స్వరూప భర్త అన్నాడు. భార్య చెయ్యందుకుని పైకి తీసుకెల్తున్నాడు.

అందరూ తననే దోషిగా చేస్తుంటే అపర్ణకు తలతీసి మొలేసినట్టైంది. 'చదువు వేరు, ఇంగిత జ్ఞానం వేరమ్మా !' దీర్ఘం దీసిందొకావిడ.

'అయ్యో రామా ! ఈమాత్రం దానికే ఇంత ఇదా' గిరుక్కున వెనుదిరిగి వెళ్లింది అపర్ణ. బెడ్రూంలో దూరి మంచం మీద మూడంకె వేసింది.

పాపం ! కుడితిలో పడ్డ ఎలుకలాగైపోయాడు మధుసూదన్. పెళ్లాన్ని ప్రసన్నం చేసుకోవడమెలా ? చెంపలు నిమురుతూ బుల్లిబుల్లి మాటలతో బుజ్జగింపుకు దిగాడు. ఏవో కొన్ని మాటలు చెప్పి చివరికి 'అన్నట్లూ ఈ రోజు కొత్త సినిమా రిలీజవుతుంది. డ్యూటీ కెళ్ళేప్పుడే టికెట్లు కొనుక్కెల్తా. ఫస్ట్‌షో కోసం త్వరగాలే... స్నానం చేయ్. హోటల్ కెల్లి టిఫిన్ చేద్దాం..' అనేశాడు.

బ్రహ్మాస్త్రం బ్రహ్మాండంగా పంజేసింది.

మధుసూదన్ జేబులోంచి టికెట్లు పలుకరిస్తున్నాయి. ఐదు తర్వాత అరక్షణం గూడా ఆఫీసులో కాలు నిలువలేదు.

మధుసూదన్ ట్రిమ్ముగా, అపర్ణ గుమ్ముగా తయారైనారు. ఇంకో పావుగంటలో సినిమా థియేటర్ చేరాలి. 'అట్నుంచటే హోటల్‌కెల్లి భోంచేసి వద్దామండీ !' అపర్ణ ప్రపోజల్ అప్రూవైంది. గబగబా బయటికొచ్చి వాకిట్లో నుంచుంది. మధుసూదన్ ఇంటికి తాళం వేస్తున్నాడు. పట్టుచీరను, మల్లెదండను తడిమి తడిమి చూసుకుంటోంది.

అపర్ణ నడినెత్తిమీద దబదబా పడుతుందేదో. తరిగిన కూరగాయల అవశేషాలు, కూరల్లోంచి ఏరిపారేసిన మిరపముక్కలు, ఇల్లూడ్చిన చెత్త... బంగళాపై నుండి పడుతోంది. పరేషానై పైకి చూసింది. చెత్త కుమ్మరిస్తుందెవరో కాదు... స్వరూప...

'సినిమా కెల్తున్నారా వదినా ?' అప్యాయంగా పలుకరించింది. అపర్ణ ఒంటి నిండా చెత్త... ఖాళీ కొబ్బరిచిప్ప తాకిడికి జడలోని మల్లెపూల దండ నేలపాలైంది. మెడలోని రవ్వల నెక్లెస్ వెలవెల బోయింది. పట్టుచీర నిండా తడిసిన చెత్త, అవమానం, అభిజాత్యం అరికాలు మంట నెత్తికెక్కింది.

'ఛీఛీ... నంగనాచిలా ఆ పలుకరింపేమిటి ?' పిడికిలి బిగించి పైకి చూసింది. పెదాలు వణికి పోతున్నాయి. తాళం పక్కన బెట్టి తలుపులు తెరిచాడు మధుసూదన్.

'అయ్యయ్యో! ఇంగిత జ్ఞానం ఇంతదాకా వచ్చిందా?' అంటూ అపర్ణ చెయ్యందుకుని లోపలికి లాక్కెల్లాడు.

'బాగా ఆలోచించు అపర్ణా! ఇప్పుడేమనుకున్నా ఏం లాభం లేదు... అవునా!' గుర్తు చేశాడు.

ఇంగిత జ్ఞానమా!... పొద్దటి చెత్త కార్యక్రమం అపర్ణ బుర్రలో గిర్రుమంది.

తనది పొరపాటే! చఛా... కుక్కకాటుకు చెప్పుదెబ్బలాగైపోయింది. ఆవేశం నుండి ఆలోచన పొంగుకొచ్చింది.

ఏదైనా తనదాకా వస్తే తెలీదంటారు. పొద్దున స్వరూప వదిన ఎంత బాధ పడిందో...

'చూడు అపర్ణా! చదువుతోపాటు సంస్కారమంటారు గదా!... ఇంకేదో సముదాయించబోయాడు. కోటీశ్వరుని ఇంట్లో పెరిగిన ఈ కొమ్మ ఎంత హంగామా చేస్తుందోననే భయంతో.

అపర్ణ మొహంలో రంగులుమారాయి. గర్వం, అహం స్థానాల్లో సిగ్గు, లజ్జ ఆవరించాయి.

'నేనిప్పుడే స్వరూప వదినకు క్షమాపణ...'

'అంత అవసరం లేదులే. మా చెల్లాయి స్వరూప చాలా మంచిది. నీకో ప్రాక్టికల్ లెస్సనివ్వాలని...'

'అందుకేనండీ! ముందు ఆవిడ దగ్గరకెల్లి సారీ చెప్పాలి...'

అంతకుముందే వచ్చి గడపలో నుంచున్న స్వరూప ముఖారవిందము విప్పారింది. ఇహ నిలువలేక

"దేరీజ్ నో లారీ టు క్యారీ యువర్ సారీ మేడమ్!" అంటూ వచ్చి అపర్ణను కౌగిట్లో బంధించింది.

'సారీ వదినా! మీ ప్రేమ వ్యవహారం ఆది నుండి పెళ్లి ఆహ్వానాల దాకా అన్నయ్య చెప్పాడు....' బాధగా అంటూంటే అపర్ణ చెయ్యి నోటి కడ్డమొచ్చింది.

'ఎంతైనా ఆడబిడ్డంటే అర్థమొగుడనిపించుకున్నావు గదూ!' అంటున్న అపర్ణ జడలాగి చెంపలుగిల్లింది స్వరూప.

అందరి నవ్వులు పూల చినుకులైనాయి.

*(జలధి - 16-3-2004)*